క్లుప్తంగా

కొత్తూరులో ఆర్డీఓ పూజలు



పూజలు చేస్తున్న ఆర్డీఓ విశ్వనాథ్

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం నంద్యాల ఆర్డీఓ విశ్వనాథ్, కుటుంబసభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. సిబ్బంది వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆర్డీఓ కుటుంబీకులతో కలిసి స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. ఆలయ నిర్వాహకులు ఆయన్ను స్వామివారి శేషవస్త్రాలతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు.

డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి



శ్రీనివాసరెడ్డి

సి.బెళగల్: మండల తహసీల్దార్‌గా పనిచేస్తున్న శ్రీనివాసరెడ్డికి పదోన్నతిలో భాగంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పదవి వరించింది. పదోన్నతి పొందిన శ్రీనివాసరెడ్డి శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా రాపూర్ తెలుగుగంగ ప్రాజెక్ట్ (టీజీపీ) నీటి పారుదల పథకం భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమితులయ్యారు. శ్రీనివాసరెడ్డి మండల తహసీల్దార్‌గా గత సెప్టెంబర్ 26న బాధ్యతలు స్వీకరించారు. అయితే ఈ నెల 1వ తేదీ నుంచి జనవరి 20వ తేదీ వరకు తన వ్యక్తిగత కారణాలతో మెడికల్ లీవ్‌లో ఉన్నారు. అలాగే 1997 -1998 మధ్య కాలంలో సి.బెళగల్ మండలంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ)గా బాధ్యతలు నిర్వర్తించారు. అదేవిధంగా గతంలో మండలంలో తహసీల్దార్లుగా పనిచేసిన శివశంకర్‌నాయక్, అనుపమ సైతం పదోన్నతులు పొందారు. శివశంకర్‌నాయక్ తిరుపతి జిల్లా డిప్యూటీ కలెక్టర్ (ప్రోటోకాల్ - 1)గా నియామకం కాగా, అనుపమ విపత్తుల నిర్వహణ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ (డీపీఎం)గా చిత్తూరు జిల్లాకు నియమితులయ్యారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

పాణ్యం: మండలంలోని తమ్మరాజుపల్లె గ్రామానికి చెందిన వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడి కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి ఆదివారం తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన వడ్డె తిమ్మయ్య (60) ఈనెల 14వ తేదీన ఉదయం బహిర్భూమికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిందన్నారు. గాయపడిన తిమ్మయ్యను కర్నూలు జీజీహెచ్‌కు తరలించగా కోలుకోలేక ఆదివారం మృతి చెందినట్లు చెప్పారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె సంతానం ఉన్నట్లు తెలిపారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

జాతీయస్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపిక



సైక్లింగ్ జాతీయ జట్టుతో బురాన్‌దొడ్డి విద్యార్థిని వీరేషమ్మ (బాక్స్‌లో)

సి.బెళగల్: మండలంలోని బురాన్‌దొడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని విద్యార్థిని వీరేషమ్మ జాతీయస్థాయి సైక్లింగ్ పోటీలలో పాల్గొనేందుకు బీహార్‌కు చేరుకున్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) పోటీలలో భాగంగా మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో ఆమె సత్తా చాటి జాతీయస్థాయి రోడ్ సైక్లింగ్ పోటీలకు ఎంపికైంది. ఈ మేరకు ఈ నెల 22వ తేదీ నుంచి 26వ తేదీ వరకు బీహార్ రాష్ట్రం పాట్నాలో జరగనున్న పోటీల్లో పాల్గొనేందుకుగాను వీరేషమ్మ ఆదివారం జాతీయ జట్టు సభ్యులను కలుసుకున్నారు. ఈ సందర్భంగా వీరేషమ్మకు హెచ్ఎం నిర్మళ వసంతకుమారి, పీడీ సత్యకుమార్, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

గడ్డివామి దగ్ధం

కల్లూరు: మండల పరిధిలోని చిన్నటేకూరులో ఆదివారం గడ్డివామి దగ్ధమైంది. గ్రామానికి చెందిన బోయ సుంకన్న పశుగ్రాసం కోసం గడ్డివాము వేసుకున్నారు. ఆదివారం ప్రమాదవశాత్తు నిప్పు అంటుకోవడంతో మంటలు చెలరేగగా సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ కర్నూలు కేంద్రం సిబ్బంది అక్కడికి చేరుకుని నీళ్లు చల్లి మంటలను అదుపుచేశారు. అగ్ని ప్రమాదంలో పశుగ్రాసం మెత్తం కాలిపోయిందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.

కబడ్డీ విజేత గుండ్లకొండ జట్టు

తుగ్గలి: మునిస్వామి ఉరుసు సందర్భంగా నల్లగుండ్లలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో గుండ్లకొండ జట్టు విజేతగా నిలిచింది. పోటీలను పత్తికొండ రూరల్ సీఐ పులిశేఖర్ ప్రారంభించారు. ఫైనల్ పోటీల్లో ఆదివారం గుండ్లకొండ-వర్కూరు జట్లు తలపడగా గుండ్లకొండ జట్టు విన్నర్స్‌గా వర్కూరు జట్టు రన్నర్స్‌గా నిలిచాయి. తర్వాతి స్థానాల్లో వెంకటాపురం, బోయ బొంతిరాల్ల జట్లు నిలిచాయి. విజేతలకు వరుసగా దాతలు రంగప్ప, కోళ్ల రంగన్న రూ.20,016, మజీద్ రూ.15,016, సత్యప్రకాష్ రూ.10,016, దేవదాసు గౌడ్ రూ.5,016 నగదును అందజేశారు.

ఈ చిత్రంలో కనిపిస్తున్న దృశ్యం మండల పరిధిలో కె.మార్కాపురం గ్రామంలోనిది. గ్రామంలో ప్రధాన వీధిలో మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. అక్కడి సమీపంలోనే అంగన్‌వాడీ కేంద్రం ఉంది. నిత్యం మురుగు పారుతుండడంతో దోమలు, ఈగలు విజృంభిస్తున్నాయని, దీంతో పిల్లలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ కాలువలో మురుగు నీరు సక్రమంగా ప్రవహించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కె.మార్కాపురంలో రోడ్డుపై పారుతున్న మురుగు నీరు



రోడ్డుపైనే మురుగు నీరు

- విజృంభిస్తున్న దోమలు
- సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం

కల్లూరు: గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. మురుగు నీరు రోడ్లపైనే పారుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 18 గ్రామ పంచాయతీలు, ఐదు మజారా గ్రామాలతో కలిపి మొత్తం 23 గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో వీధుల్లో, డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్త చెద్దారం తొలగింపుపై అధికారులు ఏ మాత్రం దృష్టి పెట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మురుగు, చెత్త, దోమలు, ఈగలు, లార్వాల సంతతికి నెలవుగా మారింది. కొన్ని గ్రామాల్లో వీధులలో ఎక్కడి చెత్త అక్కడే ఉంటోంది. దీంతో స్థానిక ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లోని డ్రైనేజీలు చెత్త చెదారంతో నిండిపోయి పూడిక పేరుకుపోవడంతో మురుగు నీరు రోడ్లపైకి వస్తోంది. రోడ్లపై గుంతల్లో నిల్వ ఏర్పడి భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. పారిశుద్ధ్య లోపంతో



బస్తిపాడులో రోడ్డుపై నిలిచిన మురుగు నీరు

దోమలు, ఈగలు విజృంభిస్తున్నాయి. గత కొంతకాలంగా గ్రామాలలో ఎక్కడా పూర్తిస్థాయిలో పారిశుద్ధ్య పనులు చేపటడం లేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



గత కొన్ని రోజులుగా చిన్నటేకూరులోని ఊరువాకిలి, పెద్దమ్మ గుడి మధ్యలో ఉన్న రోడ్డుపై మురుగు నీరు ప్రవహిస్తోంది. డ్రైనేజీ కాలువ చెత్త చెదారంతో నిండడం, పూడికను తొలగించకపోవడంతో రోడ్డుపైకి మురుగు నీరు వస్తోంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం చలికాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– రామ్ గోపాల్, చిన్నటేకూరు

సాగునీటి మోటార్లు చోరీ



దుండగులు మోటార్లను ఎత్తుకెళ్లడంతో దిగాలుగా రైతులు

కల్లూరు: హంద్రీ– నీవా కాలువ నీటితో పంటలు పండించుకుంటున్న రైతులకు చెందిన మోటార్లను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. మండలంలోని చెట్లమల్లాపురం గ్రామానికి చెందిన రైతులు, కౌలు రైతులు హంద్రీనీవా కాలువ గడ్డపై వేలాది రూపాయలు ఖర్చు చేసి మోటార్ల ఏర్పాటు చేసుకుని పంటలకు నీరు కట్టుకుంటున్నారు. అయితే కొందరు గుర్తు తెలియని దుండగులు శనివారం రాత్రి గ్రామానికి చెందిన గిడ్డయ్య, మునిస్వామి, శేఖర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, పుల్లన్న, శ్రీనివాసులు, నాగరాజు, శ్రీనివాసులురెడ్డి, పరమేశ్వరరెడ్డి, శ్రావన్‌కుమార్‌రెడ్డి, కృష్ణరెడ్డి, వెంకటేశ్వర్లు తదితర రైతులకు చెందిన మోటార్లను ఎత్తుకెళ్లారు. వేలాది రూపాయాలు వెచ్చించి మోటార్లు ఏర్పాటు చేసుకున్నామని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఘటనపై ఉలిందకొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నాలుగు లైన్ల రోడ్డు నిర్మించాలి

కోడుమూరు రూరల్: కోడుమూరు నుంచి కర్నూలుకు నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఆదివారం కోడుమూరు పాతబస్టాండ్ సెంటర్‌లో సీపీఐ, సీపీఎం నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు రాజు, గఫూర్ మియ్యా మాట్లాడుతూ.. కర్నూలు నుంచి కోడుమూరు మీదుగా ఆదోని, ఎమ్మిగనూరు, బళ్లారి, గుంతకల్ వంటి ప్రాంతాలకు నిత్యం అనేక మంది ప్రజలు ప్రయాణం చేస్తుంటారని, అయితే రోడ్డు వెడల్పు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ముఖ్యంగా కోడుమూరు నుంచి కర్నూలు మధ్య రోజుకో ప్రమాదం జరుగుతుందని, ప్రభుత్వం స్పందించి కర్నూలు నుంచి కోడుమూరు మీదుగా బళ్లారి వరకు నాలుగు లైన్ల రోడ్డు నిర్మించాలని డిమాండ్



కోడుమూరులో రాస్తారోకో చేస్తున్న సీపీఐ, సీపీఎం నాయకులు

చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ముందు ప్రజలతో కలిసి మరింత ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. స్థానిక సీపీఐ, సీపీఎం, ప్రజాసంఘాల నాయకులు కామార్తి రాజు, దూళ్ల భాస్కర్, ఈరన్న, రాముడు, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు న్యూసిటీ: ఉమ్మడి జిల్లాలోని కర్నూలు, పాణ్యం నియోజకవర్గాల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయా పోస్టుల భర్తీకి చర్యలు తీసుకున్నట్లు ఐసీడీఎస్ పీడీ నిర్మల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు నియోజకపరిధిలో ఖాళీగా ఉన్న 6 ఆయా పోస్టులు, పాణ్యం నియోజకవర్గం పరిధిలో రెండు అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులతో పాటు 15 ఆయా పోస్టులను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 20 నుంచి 28వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు పదో తరగతి, ఆయా పోస్టుకు 7వ తరగతి పాసై ఉండాలని, అలాగే 18 - 35 సంవత్సరాలోపు వయసు కలిగిన స్థానిక మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ప్రకటనలో వెల్లడించారు.

దరఖాస్తు చేసుకోండి

సి.బెళగల్: మండలంలో ఖాళీగా ఉన్న ఆరు అంగన్‌వాడీ పోస్టులకు అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని కోడుమూరు ప్రాజెక్ట్ సీడీపీఓ వరలక్ష్మి సూచించారు. ఆమె ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొంటూ.. మండలంలోని గొల్లలదొడ్డి, సంగాల గ్రామాలలో అంగన్‌వాడీ టీచర్ పోస్టులు, మారందొడ్డి, తిమ్మందొడ్డి, గుండ్రేవుల, కొత్తకోట గ్రామాలలో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయని వెల్లడించారు. గొల్లలదొడ్డి గ్రామంలోని ఒకటవ కేంద్రానికి ఎస్సీలు, సంగాల రెండవ కేంద్రం ఎస్టీ మహిళకు రిజర్వ్ అయ్యాయని, ఆయా పోస్టులు మారందొడ్డి రెండవ కేంద్రం – ఓసీ, తిమ్మందొడ్డి – ఈడబ్ల్యూఎస్, గుండ్రేవుల ఒకటవ కేంద్రం – బీసీ బీ, కొత్తకోట నాల్గవ కేంద్రం – ఓసీలకు రిజర్వ్ అయినట్లు వెల్లడించారు. అర్హులైన మహిళలు ఈ నెల 28వ తేదీలోపు సంబంధిత ధృవపత్రాల రెండు సెట్లను గజిటెడ్ అధికారితో సంతకం చేయించి కోడుమూరు ప్రాజెక్ట్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

అ'పూర్వ' సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

గడివేముల: వారంతా గడివేముల జిల్లా పరిషత్ పాఠశాలలో 1983–89 సంవత్సరం వరకు కలిసి చదువుకున్నారు. అప్పట్లో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఆదివారం ఆ పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం ద్వారా తిరిగి కలుసుకున్నారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా 36 ఏళ్ల తర్వాత ఒకచోట కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. వారి మాటల్లో.. 'ఏమిరా ఎలా ఉన్నావు.. ఏమి చేస్తున్నావు.. మామ బాగున్నావా, పిల్లలు ఏమి చేస్తున్నారు. ఎక్కడ పనిచేస్తున్నావు' అనే సంభాషణలు జరిగాయి. ఒకరి విషయాలు ఒకరు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ నాటి తీపి గుర్తులను నెమరువేసుకున్నారు. నాటి ముచ్చట్లు గుర్తు చేసుకుని మైమరచిపోయారు. ఆప్యాయంగా పలకరించుకుని కుటుంబ యోగక్షేమాలు చెప్పుకున్నారు. చిన్నప్పటి అల్లరి చేష్టలు గుర్తు చేసుకుని మురిసిపోయారు. అందరూ ఒకచోట కూర్చొని భోజనం చేశారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అంతకుముందు గడివేముల పాత బస్టాండు నుంచి స్కూల్ వరకు ర్యాలీగా వచ్చారు. పూర్వ విద్యార్థుల్లో ఎంపీడీఓ వాసుదేవగుప్తా, హెచ్ఎం విక్టర్ ఇమ్మానియేల్, టీచర్ మహబూబ్ బాషా, ఈశ్వరయ్య, నాగశేషులు, విలియం, మనోహర్ తదితరులు ఉన్నారు.

● తొలగిన ముప్పు

సాక్షి ఎఫెక్ట్

సి.బెళగల్: మండలంలోని కొత్తకోట గ్రామ శివారులోని పంట పొలాల్లో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను అల్లుకుపోయిన తీగ మొక్కలను మండల విద్యుత్ అధికారులు తొలగించే చర్యలు చేపట్టారు. తీగ మెక్కలు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు అల్లుకుని ప్రమాదకరంగా మారిన నేపథ్యంలో ఈ నెల 18వ తేదీన 'సాక్షి' దినపత్రికలో 'పొంచి ఉన్న ప్రయాదం' శీర్షికన వార్తా కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు సిబ్బందితో వాటిని తొలగించారు. కొత్తకోట నుంచి రేమట గ్రామానికి వెళ్లే దారిలో విద్యుత్ స్తంభాలపైకి పాకిన తీగజాతి మొక్కలను, స్తంభాల దగ్గర ఏపుగా పెరిగిన చెట్లను విద్యుత్ ఏఈ సుకుమార్ తన సిబ్బందితో కలిసి తొలగించారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన 'సాక్షి'కి మండల ప్రజలు, రైతులు ధన్యవాదాలు తెలిపారు.



రేమట దారిలో జాయింట్ స్తంభాల మధ్య తీగ మొక్కలను తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది



పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తీగమొక్కను తొలగించిన దృశ్యం

నేటి నుంచి రీసర్వే

సి.బెళగల్: మండల కేంద్రంలో సోమవారం నుంచి భూముల రీసర్వే చేపట్టనున్నట్లు రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ.. 20వ తేదీ నుంచి ఏడు బృందాలుగా ఏర్పడి సి.బెళగల్, చింతమానుపల్లె గ్రామాల భూములను రీసర్వే చేస్తారని చెప్పారు. ప్రతి బృందంలో ఇద్దరు మండలంలోని ఇతర రెవెన్యూ గ్రామాలలోని సచివాలయాల్లో పని చేస్తున్న సచివాలయ సర్వే సహాయకులు, ఒక వీఆర్వో, ఒక వీఆర్ఏ చొప్పున మొత్తం నలుగురు రెవెన్యూ అధికారుల బృందం సభ్యులుగా ఉంటారని ఆయన తెలియజేశారు. బృందం సభ్యులు రోజుకు 20 ఎకరాల చొప్పున భూములను సర్వే చేయడం జరుగుతుందన్నారు. ఏ రోజున, ఏ భూములలో సర్వే చేస్తారన్న సమాచారాన్ని భూమి యజమానులకు ముందుగానే తెలియజేస్తారని రీసర్వే డీటీ తెలిపారు.

పీజీఆర్ఎస్‌కు అధికారులందరూ హాజరవ్వాలి

సి.బెళగల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం ఆదేశించారు. ఆయన ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడిస్తూ.. ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం మండలంలోని అన్ని శాఖల అధికారులతో కలిసి పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, కార్యక్రమానికి మండల అధికారులందరూ తప్పకుండా హాజరు కావాలని సూచించారు. గైర్హాజరైన అధికారులపై చర్యలు చేపట్టేలా ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని పేర్కొన్నారు. మండల ప్రజలు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని, తమ సమస్యలను పరిష్కరించుకోవాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ పిలుపునిచ్చారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామంలో ఓ వ్యక్తి ఆదివారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వెలుగోడుకు చెందిన వడ్డె శ్రీను రోడ్డుపై పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించగా విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో నంద్యాల జీజీహెచ్‌కు తరలించారు. ఆత్మహత్య ప్రయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉందన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు రూ.10 లక్షలు ఇవ్వాలి



సమావేశమైన దళిత హక్కుల పోరాట సమితి నాయకులు

కర్నూలు (రూరల్): సొంతిల్లు లేని నిరుపేదలకు ఇంటి నిర్మాణానికి రూ.10 లక్షలు సాయం అందించాలని దళిత నాయకులు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని పూడూరు గ్రామంలో ఆదివారం దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సమితి జిల్లా ప్రధన కార్యదర్శి సి.మహేష్ మాట్లాడుతూ.. కేరళ రాష్ట్రం తరహాలో ఆంధ్రప్రదేశ్‌లో దళితులు ఇల్లు నిర్మించుకునేందుకు రూ.10 లక్షలు చొప్పున ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎర్పడి 7 నెలలు పూర్తయినా ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయకపోవడం దారుణమన్నారు. దళితులను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. దళిత హక్కుల పోరాట సమితి నాయకులు రామచంద్రుడు, డప్పు మణిక్యం, ఆశోక్, మల్లికార్జున, మధు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీపీ వివాహం

ఓర్వకల్లు: స్థానిక మండల పరిషత్ అధ్యక్షుడి వివాహ వేడుక ఆదివారం ఘనంగా జరిగింది. మండలంలోని నన్నూరు గ్రామానికి చెందిన కోటకొండ కమలమ్మ, కృపన్న దంపతుల చిన్న కుమారుడు కోటకొండ తిప్పన్న (సాముయేలు)కు కర్నూలు మండలం, జొహరాపురానికి చెందిన ప్రేమరపోగు జయమ్మ, మద్దిలేటిల రెండో కుమార్తె పి.స్వాతితో ఆదివారం వివాహం ఘనంగా జరిగింది. ఈ వేడుకకు వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కర్నూలు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మీదివేముల ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శ్రీరెడ్డి చెన్నారెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అక్షింతలు వేసి నూతన వధూవరులను ఆశీర్వదించారు.



ఎంపీపీ తిప్పన్న దంపతులతో శ్రీరెడ్డి చెన్నారెడ్డి, సర్పంచు బ్రహ్మయ్య తదితరులు

ప్రమాదకర గొయ్యి పూడ్చివేత

సాక్షి ఎఫెక్ట్

కర్నూలు(రూరల్): కర్నూలు–గుంటూరు ప్రధాన రహదారిపై ప్రేమగిరి మాత పుణ్యక్షేత్రం, మిలటరీ కాలనీ సమీపంలో తారు రోడ్డు మార్జిన్‌ను ఆనుకుని ప్రమాదకరంగా ఉన్న గొయ్యిని అధికారులు పూడ్చివేశారు. రహదారిపై ప్రమాదకరంగా గొయ్యి ఏర్పడడంతో ఈ నెల 18వ తేదీన సాక్షి దినపత్రికలో వార్తా కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన పంచాయతీ అధికారులు 24 గంటల వ్యవధిలోనే గొయ్యిని పూడ్చి వేశారు. దీంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.



గొయ్యిని పూడ్చివేసి చదును చేసిన దృశ్యం

కార్యకర్త మృతికి నివాళి

కోడుమూరు రూరల్: వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రమేష్‌నాయుడు సోదరుడి కుమారుడు డాక్టర్ వంశీకృష్ణనాయుడు (28) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ కోలుకోలేక శనివారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్దన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ ఆదివారం కోడుమూరు చేరుకుని వంశీకృష్ణనాయుడు భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మాజీ ఉప సర్పంచు ప్రవీణ్‌కుమార్, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.



వంశీకృష్ణనాయుడు భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న కోట్ల హర్షవర్దన్‌రెడ్డి, ఆదిమూలపు సతీష్

పేరున్నా.. ఊరు లేదు

భౌతికంగా ఆ గ్రామం ఎవరికీ కనిపించదు. ఇంకా చెప్పాలంటే ఆ గ్రామం ఉన్నట్లు స్థానికులకే తెలియదు. అయితే రెవెన్యూ రికార్డుల్లో మాత్రం ఆ ఊరు భద్రంగా ఉంది. భూముల క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లు వంటి కార్యకలాపాలన్నీ ఆ గ్రామం పేరిటే కొనసాగుతున్నాయి. భౌతికంగా లేని గ్రామం పేరుతో కార్యకలాపాలన్నీ జరుగుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

- రెవెన్యూ రికార్డులలో మాత్రమే పేరు.. భౌతికంగా కనపడని గ్రామం
- భూముల క్రయవిక్రయాల్లో గ్రామం పేరు వాడకం

గడివేముల: రెవెన్యూ రికార్డుల ప్రకారం మండల పరిధిలో చెనకపల్లె గ్రామం ఉంది. అయితే ఆ గ్రామం అక్కడ కనబడదు. అక్కడ ఉండుట్ల, పైబోగుల గ్రామాలు మాత్రమే కనిపిస్తాయి. ఈ ఊర్లలో వేల సంఖ్యలో జనాభా నివశిస్తున్నారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం ఒండుట్ల, పైబోగుల గ్రామాలు కనపడకుండా చెనకపల్లె గ్రామం మాత్రమే కనబడుతుంది. ఈ రెండు గ్రామాల్లో పొలాల క్రయవిక్రయాలు చేసుకుంటే చెనకపల్లె గ్రామం పేరిట మాత్రమే సాధ్యమవుతుందని గ్రామస్తులు తెలిపారు. బ్రిటిష్ కాలంలో చెనకపల్లె గ్రామం మాత్రమే ఉండేదని, వందేళ్ల క్రితం ఆ గ్రామంలో ప్రజలు ఉండేవారని.. కాలక్రమేణా ఆ గ్రామస్తులు ఇతర ప్రాంతాలకు వెళ్లిపోవడంతో ఊరు ఖాళీ అయ్యిందని పెద్దలు చెబుతున్నారు. అయితే అప్పట్లో రికార్డుల్లో అధికారికంగా నమోదై ఉండడంతో ఆ పేరుతోనే నేటికీ కార్యకలాపాలు సాగుతున్నాయి.

చెనకపల్లె గ్రామ పరిధిలోని 4800 ఎకరాల భూమి

గడివేముల మండలంలో 16 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. అన్ని గ్రామాలు భౌతికంగా ఉన్నప్పటికీ చెనకపల్లె గ్రామం మాత్రం కనుమరుగైంది. రెవెన్యూ రికార్డుల ప్రకారం చెనకపల్లె గ్రామం మాత్రమే వస్తుందని, తమ గ్రామాలైన వండుట్ల, పైబోగుల పేర్లు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఈ రెండు గ్రామాల పరిధిలో పరిధిలో సుమారు 4800 ఎకరాలకు పైగా భూములు ఉన్నాయి. ప్రస్తుతం చెనకపల్లె పొలిమేర మండల పరిధిలోని చిందుకూరు, గడిగరేవుల గ్రామాల పరిధి వరకు భూములు ఉన్నాయి. ఉండుట్ల గ్రామంలో సచివాలయం ఉండడంతో ఆ గ్రామాలకు పలు సేవలు అందుతున్నాయి. రెవెన్యూ రికార్డులలో మా గ్రామం పేరు కనపడకపోవడంతో పలుచోట్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు చెబుతున్నారు.



పైబోగుల గ్రామంలో సాగు చేసిన పొగాకు పంట

చెనకపల్లె పేరుతోనే రిజిస్ట్రేషన్

ప్రస్తుతం ఉండుట్ల, పైబోగుల గ్రామస్తుల భూములన్నీ చెనకపల్లె రెవెన్యూ పరిధిలోనే ఉన్నాయి. మీ భూమి పోర్టల్‌లో ఇవే కనిపిస్తాయి. ఆ ప్రాంతాల్లోని భూముల క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లు చేయిస్తే పాత గ్రామాల పేరిటే ప్రక్రియ కొనసాగుతోంది. దీంతో లోన్లు తీసుకోవాలంటే ఆధార్‌లో ఒక విధంగా పట్టాదారు పాసుపుస్తకంలో ఒక విధంగా ఉండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు.